
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
గురువారం 14 నవంబరు 2024



కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొలనూరు సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేష్ అన్నారు. మండలంలోని మంగళపల్లి గ్రామంలో బుధవారం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు బాదనేని దేవయ్య, ప్రవీణ్, వినోద, మొగిలిపాల మల్లయ్య, ఉప్పుల నాగరాజు, శ్రీకాంత్, చంద్రయ్య, మధు తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

కాళోజీకి ఘన నివాళి

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : వేములవాడ పట్టణం న్యూ అర్బన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో కాళోజి 23వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉద్యమం ఊపిరిగా కాళోజి జీవించారని గుర్తు చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దరిశెట్టి లక్ష్మీనారాయణ, బుడంకారి విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు సారంపెల్లి గ్రామల్లో సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నేరల్ల నర్సింగంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మాజీ ఉపసర్పంచ్ ఆసాని సత్యనారాయణ రెడ్డి ఉపసర్పంచ్ పెద్దూరు తిరుపతి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రుద్రంగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో ప్రహ్లాద పర్వతంపై వెలసిన లక్ష్మీనరసింహ కల్యాణం గురువారం నిర్వహించనున్నారు. గురువారం సాయంత్రం నిర్వహించే లక్ష్మీ నరసింహస్వామి కల్యాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. భక్తులు హాజరుకావాలని కోరుతున్నారు.



- ఆధునిక హంగులు... ఆర్భాటం
- జిల్లా కేంద్రంలో 2.14 ఎకరాల్లో రూ.5.15 కోట్లతో రైతుబజార్ నిర్మాణం
- పట్టించుకోని బల్దియా
- చేకూరని ప్రయోజనం
- నాలుగేళ్లయినా వినియోగంలోకి రాని మాంసం దుకాణాలు
- షెడ్లు నిరుపయోగం.. రోడ్లపైనే రైతుల విక్రయాలు

ఇంత నిర్లక్ష్యమా?

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెలంగాణలోనే మోడల్‌గా నిలిచే విధంగా గత ప్రభుత్వ హయాంలో ఆధునిక హంగులతో నాలుగేళ్ల క్రితం నిర్మించిన రైతు బజార్ సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మానేరు తీరంలో నిర్మించిన రైతు బజార్ జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావించినా లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. సిరిసిల్ల మార్కెట్‌కు జిల్లాలోని వివిధ మండలాల రైతులతో పాటు పొరుగున ఉన్న సిద్దిపేట, కామారెడ్డి, జగిత్యాల ప్రాంతాల రైతులు కూడా కూరగాయలు విక్రయించడానికి వస్తారు.

దీనిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వ హయాంలో అప్పటి పురపాలక, ఐటీ శాఖ మంత్రి కే తారక రామారావు ప్రత్యేక చొరవతో ఎంతో ఆర్భాటంగా రైతు బజార్‌ను నిర్మించి 2020 జూన్ 23న ప్రారంభించారు. తొలిరోజు మాత్రమే రైతుబజార్‌లోని వివిధ షెడ్లలో కని పించిన రైతులు మళ్లీ వాటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. రైతు బజార్‌ను మొదట్లో మార్కెట్ కమిటీ ఆధీనంలో ఉండగా దానిని సిరిసిల్ల మున్సిపాలిటీకి బదలాయించారు. దీంతో మార్కెట్ పూర్తిగా వినియోగదారులకు, రైతులకు ఉపయోగకరంగా మారుతుందని భావించారు. కానీ కౌన్సిల్, మున్సిపల్ అధికారుల తీరును వెక్కిరిస్తోంది. రైతు బజార్ సిరిసిల్లకు అలంకార ప్రాయంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. సిరిసిల్ల గాంధీచౌక్ వద్ద గ్రామ పంచాయతీ కాలం నుంచి కొనసాగుతున్న పాత మార్కెట్‌లోనే ఉదయం నుంచి రాత్రి వరకు క్రయ విక్రయాలు జరుగుతున్నాయి.

మిగతా 8వ పేజీలో..







నిరుపయోగంగా మారిన రైతుబజార్‌లోని షెడ్లు, ఏర్పాటు చేసిన ప్రతిమలు, నిరుపయోగంగా దుకాణ సముదాయం

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (అంధ్రజ్యోతి) : సిరిసిల్లలోని జిల్లా గ్రంథాలయంలో గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు పచ్చదనం పరిశుభ్రతపై విద్యార్థులకు చిత్రలేఖనం, శుక్రవారం పుస్తక ప్రదర్శన, శనివారం గ్రంథాలయాల అవశ్యకత్తపై వ్యాసరచన, ఆదివారం మీకు నచ్చిన శాస్త్రవేత్తపై వ్యక్తృత్వ పోటీలు, సోమవారం దేశభక్తి జానపద గేయాలపై పాటల పోటీలు, మంగళవారం రంగోళి పోటీ, మోహంది పోటీలు, బుధవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ తెలిపారు.

చెరువుల్లో చేప పిల్లల విడుదల

గంభీరావుపేట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని చెరువుల్లో బుధవారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మత్స్యకార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, డీఎఫ్‌వో సౌజన్య, గంగ పుత్ర సంఘం అధ్యక్షుడు శంకర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగౌరి శంకర్, నాయకులు ఉన్నారు



చేప పిల్లలు విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మాల, మాలల ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి మాల మాలల ఉపకులాల జిల్లా చైర్మన్ రాగుల రాములు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న సిరిసిల్ల పట్టణంలో మాల మాల ఉపకులాల ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంటస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, జిల్లా కన్వీనర్ వంకల భూమయ్య, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్, నాయకులు గొట్టె లింబాద్రి, దోసల వెంకటర్రాజం, టేకుమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిబద్ధతతో చదివి పరీక్షలు రాసి ఉత్తమ ప్రతిభను కనబర్చాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పోపా ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షల కోసం విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో పున్నంచందర్ మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ శిక్షణ తీసుకోవాలని ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లను పొందాలన్నారు. గణిత బోధకులు బైరి రవీందర్, ప్రతినిధులు మచ్చ అనంద్, చేరాల తిరుపతి, దూడం మనోహర్, పాల్గొన్నారు.

గణేష్ నగర్‌లో తాగునీటి కష్టాలు

వీర్నపల్లి, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని గణేష్ నగర్ కాలనీ వాసులు తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యానికి తాగునీటి కోసం తండ్లాట తప్పడం లేదు. గ్రామపంచాయతీ ఒక వాటర్ ట్యాంకర్ నీటిని అందించడంతో కాలనీవాసులకు నీటి వసతి సరిగా అందడం లేదు. నాలుగు రోజుల నుంచి మహిళలు నీటి కోసం కష్టాలు పడుతున్న ప్రత్యేక అధికారులు సరైన ఏర్పాట్లు చేయడం లేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కష్టాలను తీర్చాలని మహిళలు వేడుకుంటున్నారు.

విశ్వబ్రాహ్మణులుగా పరిగణించాలి

వేములవాడ, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సర్వేలో విశ్వబ్రాహ్మణులను ఐదు కులాలుగా విభజించకుండా సవరణ చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పొలాస నరేందర్ బుధవారం ప్రకటనలో కోరారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల కులానికి చెందిన తాము పూర్వం నుంచే ఐదు వృత్తులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని పేర్కొన్నారు. ఇందులో కమ్మరి ఇనుము పని, వడ్రంగి కర్ర పని, కంచరి ఇత్తడి పని, శిల్పి రాతి పని, అవుసుల బంగారం పనులు లాంటివి చేసుకొని జీవిస్తున్న వారిని విశ్వబ్రాహ్మణులుగా పరిగణిస్తారని తెలిపారు.

దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

ఇల్లంతకుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరులో దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు బుధవారం మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, కురుమ సంఘ నాయకులు పోలె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

రాజన్న దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

7



ప్రధాన వైద్యశాల ఎదుట పారిశుధ్య కార్మికుల ధర్నా

పడకలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలి

ధర్నా చేస్తున్న కార్మికులు

8

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని సంబంధిత వైద్యాధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం వైద్యాధికారులతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలపై పీహెచ్‌సీల వారిగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్ వైద్యాధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న సాధారణ ప్రసవాలు, సి సెక్షన్ ప్రసవాలు, అదే సమయంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మే నుంచి అక్టోబరు వరకు 3206 ప్రసవాలు జరగగా, ప్రభుత్వ ఆసుపత్రిలో 1860, ప్రైవేట్ ఆసుపత్రిలో 1308 ప్రసవాలు జరిగాయని వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంబేద్కర్‌నగర్, విలాసాగర్, కొదురుపాక, హన్మాజిపేట, బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచే దిశగా చర్య తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణుల ప్రసవం తేదీలను అంచనా వేస్తూ జాబితా తయారు చేసుకోవాలని, ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణి మహిళలను ఎప్పటికప్పుడు ఆశా కార్యకర్తల ద్వారా ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా కార్యకర్తలతో వంద శాతం గర్భిణి మహిళల ఏఎన్సీ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, మహిళలకు సకాలంలో టీకాలు అందేలా చూడాలని తెలిపారు. అనేమియా ఉన్న గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు అందజేయాలని తెలిపారు. నవంబరు లో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా ప్రసవం జరిగే అవకాశం ఉన్న గర్భిణులు మొత్తం 464 మంది ఉన్నారని, ఇప్పటి వరకు జిల్లాలో 204 ప్రసవాలు జరిగాయని అన్నారు. జిల్లాలో తన అనుమతి లేకుండా నూతన ఆసుపత్రి రిజిస్ట్రేషన్, స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేయొద్దు అన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ వసంతరావు, మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ లక్ష్మీనారయణ, ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు అన్నారు. హన్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో కలిసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంత రావు మాట్లాడుతూ ప్రతీ ఆరోగ్య ఉపకేంద్రాలలోని ఆశాలు, ఏఎన్ఎంలు తమ లక్ష్యాలను సాధించాలన్నారు.డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, ఎంహెచ్ఎన్ అంజలి, ఎన్‌సీడీ స్టేట్ కన్సల్టెంట్ సత్యేంద్రనాథ్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్

నాయీ బ్రాహ్మణుల కులవృత్తిని కాపాడండి



వినతి పత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

వేములవాడ, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణుల కులవృత్తిని కాపాడాలని వేములవాడ పట్టణానికి చెందిన పలువురు నాయీ బ్రాహ్మణులు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వేములవాడలోని మున్నూరు కాపు సత్రంలో కొండా దేవయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్నూరు కాపు కులానికి చెందిన ఓ వ్యక్తి తమ కుల వృత్తిని దెబ్బతీసే విధంగా వేములవాడ పట్టణంలో కార్పొరేట్ తరహాలో సెలూన్ ఏర్పాటు చేయడాన్ని అడ్డుకోవాలని కోరారు. నాయీ బ్రాహ్మణుడు కాని వ్యక్తి సెలూన్ ఏర్పాటు చేయడానికి నిరసిస్తూ మూడు రోజులుగా తాము సెలూన్లు మూసివేసి నిరసన తెలుపుతున్నామని వివరించారు. ఈ విషయంలో ఇప్పటికే తాము వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో చర్చించి తగిన న్యాయం చేస్తానని కొండ దేవయ్య ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గడ్డం నవీన్, ఉపాధ్యక్షులు. సారంపల్లి సంతోష్, ఇన్నారం రమేశ్, కార్యదర్శి వెల్పాల శ్రీకాంత్, అమృత అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఎల్లారెడ్డిపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో అత్యంత కీలక ఘట్టమైన స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 10న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 15వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో నిత్యహవనము, బలిహరణము తదితర కార్యక్రమాలను నిర్వహించారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం ప్రారంభమైంది. వేదమంత్రోచ్చరణల మధ్య వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా చేపట్టారు. స్థానిక ఆశ్విని ఆసుపత్రి నిర్వాహకుడు, ప్రముఖ వైద్యుడు సత్యనారాయణ స్వామి అన్నదానం చేశారు.



మంగళ సూత్రాన్ని చూపుతున్న పురోహితులు

నేతన్నలకు ప్రభుత్వం అండ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చెక్కు అందజేస్తున్న ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్

సిరిసిల్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, నేతన్నలకు ప్రభుత్వం తరపున అండగా నిలబడతామని, ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం గణేష్‌నగర్‌లో పవర్‌లూం నేత కార్మికుడు ఎర్రం కొమురయ్య ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున రూ.2 లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కొమురయ్య మరణం చాలా బాధ కలిగించిందని, సిరిసిల్లలో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని ధైర్యంగా ఉండాలని అన్నారు. కొమురయ్య భార్య దివ్యాంగురాలిగా ఉందని ప్రభుత్వం తరపున తక్షణ సాయం కింద రూ.2 లక్షలు అందించామని అన్నారు. ఈ సంఘటన గురించి తెలియగానే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకవెళ్లి సాయం అందేలా చేశామన్నారు. నేత కార్మికులు ఎవరూ ఒత్తిడికి గురికాకుండా కుటుంబ సభ్యులను చూసుకునేందుకు నిలబడాలని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కావద్దని ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. నేత కార్మికులు ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రెండు రోజుల క్రితం భార్యభర్తలు మరణించిన సంఘన కూడా బాధ కలిగించిందన్నారు. అ కుటుంబంలోని పిల్లలకు ఉన్నత చదువులు చదివించేందుకు ప్రభుత్వ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఆసాములు, నేత కార్మికులు పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వేములవాడ క్లస్టర్ జోన్‌లో త్వరలోనే రూ.50 కోట్లతో నూలు డిపోను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకుంటామన్నారు. సిరిసిల్లి తహసీల్దార్ ఉమారాణి, చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, చేనేత సెల్ అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అకునూరి బాలరాజు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ ఆదేశించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్నబోజనంతోపాటు వంట గదిని, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు తయారు చేసే మధ్యాహ్నభోజనంలో పౌష్టికాహారంతో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయడంతోపాటు విద్యార్థులకు చదవడం, రాయడం లేక్కలు చేయడం వంటి సామర్ధ్యాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దుబాయిలో అంబారిపేట మహిళ మృతి


సుప్రియ (ఫైల్)

కథలాపూర్/గల్ఫ్ ప్రతినిధి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేటకు చెందిన ఎన్నమనేని సుప్రియ (35) అనే వివాహిత దుబాయిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం... సుప్రియకు రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన శ్రీనివాసరావుతో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లైన కొన్నేళ్లకే దుబాయికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. గత సోమవారం కొడుకు, కూతురును పాఠశాలకు పంపించగా భర్త శ్రీనివాసరావు ఎప్పటి మాదిరిగానే విధులకు వెళ్లాడు. సాయంత్రం వారు ఇంటికి వచ్చే సరికి సుప్రియ మృతి చెంది ఉంది. ఆమె మృతికి గల కారణాలు తెలియలేదు. సుప్రియ మృతదేహం స్వగ్రామం చేరుకోడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు.

రైలు కింద పడి చింతలూరువాసి మృతి


శ్రీకర్(ఫైల్)

రాయికల్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన ముద్దం శ్రీకర్ ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైలు ఎక్కుతూ రైలు కింద పడి మరణించాడు. చింతలూరు గ్రామానికి చెందిన శ్రీకర్ ఈ నెల 8న కుటుంబ సభ్యులతో కలిసి తిరు పతి దైవదర్శనానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు గూడూరు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ కింద పడి మర ణించాడు. విషయం తెలిసిన గ్రామ నాయ కులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌తో మాట్లాడి మృతదేహాన్ని త్వరి తగతిన తెలంగాణకు పంపాలని కోరా రు. అలాగే కలెక్టర్ సత్యప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం పక్షాన అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

కోరుట్ల, నవం బరు 13 (ఆంధ్ర జ్యోతి): కోరుట్ల పట్టణంలోని ప్రకా శం రోడ్డుకు చెం ది న ఉదయశ్రీ (20) అనే బీ ఫార్మసీ విద్యార్థిని బుధవారం వరంగల్ జిల్లా కేం ద్రంలోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతి చెందాడు. ఉదయశ్రీ వరంగ ల్ ఓ ప్రైవేట్ కళాశాలలో బీ ఫార్మసీ చదువు తోంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివా రం తిరుపతి వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. రైలు ఎక్కుతున్న క్రమం లో ఉదయశ్రీ ప్రమాదవశాత్తు ప్లాట్ ఫారం నుంచి కింద పట్టాలపై పడిపోయింది. గమనించిన రైల్వే సిబ్బంది తీవ్రగాయాలు పాలైన ఉదయశ్రీని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తుం డగా బుధవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఒక్కగానొక్క కూతురు మృత్యువాత పడడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల క్రైం, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో చోరీ జరిగింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన కం దుకూరి రాఘవయ్య అనే రిటైర్డు ఎంఈవో పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న బ్యాంకులో తన అవసరం నిమిత్తం లక్ష రూపాయలు విత్ డ్రా చేశాడు. అనంతరం కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మీ సేవలో లైఫ్ సర్టిఫికేట్ కోసం వెళ్లాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనం దగ్గరికి గుర్తు తెలియని వ్యక్తి ద్వి చక్ర వాహనంపై వచ్చి రాఘవయ్యతో మాట మాట కలిపి జేబులోంచి డబ్బులు కింద పడిపోయాయని నమ్మించాడు. రాఘవయ్య కిందికి వంగి చూసే లోపే తన ద్విచక్ర వాహనం ముందు ఉన్న లక్ష రుపాయల నగదు బ్యాగును అపహరించుకవెళ్లాడు. తేరుకున్న బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల జిల్లా బీమ్‌నూర్ గ్రామానికి చెందిన మావినేని రమేష్ (45) అనే వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్ రెండో టౌ ణా హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 8న ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడన్నారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని తెలిపారు. రమేష్ వివరాలు తెలపలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచామన్నారు.

దక్షిణాది కొంగు బంగారం


తెలంగాణ ఎస్‌టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు

పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తోంది. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తితో పాటు నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ దక్షిణాది కొంగుబంగారంగా గుర్తింపు పొందింది. సామాజిక బాధ్యతలో భాగంగా ఏటా లక్షలాది రూపాయల ఖర్చుతో ఆయా గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకున్న ఈ 'వెలుగుల దివ్వె' 46 వసంతాలు పూర్తి చేసుకుని గురువారం 47వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

నేడు రామగుండం ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం

వెలుగుల దివ్వెకు 47 వసంతాలు

రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు పక్కనే 4000 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు స్టేజ్ 1 కింది నిర్మించిన 800 మెగావాట్ల 2 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. రెండో దశలో మరో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పనున్నారు. స్టేజ్ 2కు సంబం ధించి ఈనెల 29న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహి స్తున్నారు. ఇటీవలే స్టేజ్ 2కు 29,344.85 కోట్ల రూపాయల వ్యయాన్ని ఎన్టీపీసీ బోర్డు పెట్టుబడిగా ఖరారు చేసింది. ఎల్అండ్‌టీ సంస్థకు నిర్మాణ కాంట్రా క్టు దక్కినట్లు సమాచారం. 4000 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తయితే దేశంలోనే ఒకే ప్రాంతం నుంచి అత్యధిక విద్యుత్ ఉత్పత్తి(6600 మెగావాట్లు) చేస్తున్న ప్రాజెక్టుగా రామగుండం ఎన్టీపీసీ గుర్తింపు సాధించనున్నది.

400 మెగావాట్ల తెలంగాణ ఎస్‌టీపీపీ..

జ్యోతినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో అతి పెద్ద సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం రామగుండం ఎన్టీపీసీ.. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. నిర్దేశిత లక్ష్యాలను అధిగమిస్తూ.. ముందుకు సాగుతోంది.. ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 1978 నవంబరు 14న పునాది రాయి పడిన ఈ వెలుగుల దివ్వె నాలుగున్నర దశాబ్దాలుగా జాతికి వెండి వెలుగులను పంచుతున్నది. నేటితో 47వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ లిమిటెడ్‌కు చెందిన 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ దక్షిణాది విద్యుత్ అవసరాలను గణనీయంగా తీరుస్తున్నది. ప్రతి ఏటా ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగుతున్నది. 1978 నవంబరు 14 అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ చేతుల మీదుగా పునాది రాయి పడిన ఈ ప్రాజెక్టులోని యూనిట్లు నిర్ణీత గడువుకన్నా ముందే ఉత్పత్తిని ప్రారంభించాయి.

యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభ వివరాలు..

స్టేజ్-1
- 200 మెగావాట్ల 1వ యూనిట్ 1983 అక్టోబర్ 26
- 200 మెగావాట్ల 2వ యూనిట్ 1984 మే
- 200 మెగావాట్ల 3వ యూనిట్ 1984 డిసెంబర్

స్టేజ్-2
- 500 మెగావాట్ల 4వ యూనిట్ 1988 జనవరి
- 500 మెగావాట్ల 5వ యూనిట్ 1989 మార్చి
- 500 మెగావాట్ల 6వ యూనిట్ 1989 అక్టోబర్


స్టేజ్-3
- 500 మెగావాట్ల 7వ యూనిట్ 2004 సెప్టెంబర్

ఏ రాష్ట్రానికి ఎంత విద్యుత్...

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు 754 మెగావాట్లు(29శాతం)
- తమిళనాడుకు 572 మెగావాట్లు(22శాతం)
- కర్నాటకకు 416 మెగావాట్లు(16శాతం)
- కేరళకు 312 మెగావాట్లు(12శాతం)
- గోవాకు 130 మెగావాట్లు(5శాతం)
- పాండిచ్చేరికి 52 మెగావాట్లు(2శాతం)
- ఎవరికీ కేటాయించనిది (అన్ అలాటెడ్) 364 మెగావాట్ల(14శాతం)

ప్రతిష్టాత్మకమైన అమెరికా పవర్ అవార్డు సొంతం..

అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన అమెరికాకు చెందిన పవర్ మేగజైన్ రామగుండం ఎన్టీపీసీని ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుల్లో ఒకటిగా గుర్తించింది. మేగజైన్ ఎడిటర్ల కమిటీ గుర్తించిన 7 అత్యుత్తమ ప్లాంట్లలో రామగుండం ప్లాంటుకు ప్రపంచంలో 2015 ఏడాదికిగాను టాప్ ప్రాజెక్టుగా అవార్డును ప్రకటించింది. 130 ఏళ్ల చరిత్ర ఉన్న పవర్ పత్రిక అవార్డు లభించడం అంటే నోబుల్ ప్రైజ్ వచ్చినట్లుగా ప్రపంచంలోని విద్యుత్ సంస్థలు భావిస్తాయి.



ప్రాజెక్టుకు లభించిన అవార్డులు..

రామగుండం ఎన్టీపీసీకి ఈ 47 సంవత్సరాలలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో టస్కర్ నుంచి నాలుగు నేషనల్ అవార్డులను సాధించింది. ఎనర్జీ ఎఫిషియెన్సీ 2024 అవార్డు, ఎనర్జీ లీడర్‌షిప్ 2024 అవార్డు గ్రీన్‌టెక్ జాతీయ సేఫ్టీ ప్లాటినం అవార్డు, బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు, పలుమార్లు స్వర్ణశక్తి అవార్డులు, విశ్వకర్మ జాతీయ అవార్డులు లభించాయి.

సామాజిక బాధ్యత..

విద్యుత్ ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతపైన కూడా యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నది. గత 16 ఏళ్లలో సంస్థ సుమారు 500 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. స్వచ్ఛ భారత్‌లో రెండేళ్ల క్రితం తెలంగాణలోని 4 జిల్లాలో 11 కోట్ల రూపాయలతో 777 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, ఆరోగ్యం, వ్యవసాయానికి, స్వయం ఉపాధి కోసం సంస్థ చేయూతనిస్తోంది. సీఎస్ఆర్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా లక్షలాది రూపాయల ఖర్చుతో వివిధ సౌకర్యాలను కల్పిస్తోంది.

పర్యావరణ పరిరక్షణకు కృషి..

పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్టీపీసీ విశేష కృషి చేస్తున్నది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో లక్షలాది మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తోంది. ఎన్టీపీసీ పరిసర ప్రాంతంలో సుమారు 14 లక్షల చెట్లను సంస్థ సంరక్షిస్తున్నది. ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద సమస్యను నివారించడానికి సిమెంటు, ఇటుకల పరిశ్రమలకు బూడిదను సరఫరా చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రాజెక్టుకు గతంలోనే ఐఎస్‌వో-14001 గుర్తింపు లభించింది.

సమష్టి కృషితో ప్రగతి పథంలో ఎన్టీపీసీ

కేదార్ రంజన్ పాండు, ఆర్ఈడీ



ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికుల సమష్టి కృషి ఫలితంగా రామగుండం ప్రాజెక్టు ప్రగతి పథంలో నడుస్తోంది. రక్షణతో కూడిన నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ఉత్పత్తి, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సీఎస్ ఆర్, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. ఎన్టీపీసీ రేజింగ్ డే సందర్భంగా సిబ్బందికి, ఈ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు.



సీఎస్ఆర్ కింద పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, 1983లో మొదటి యూనిట్‌ను ప్రారంభిస్తున్న అప్పటి జీఎం ఎం.ఎ.హాయ్ (ఫైల్)

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన


విద్యార్థుల నృత్య ప్రదర్శన

- రెండో రోజు వ్యవసాయ కళాశాల విద్యార్థుల కల్చరల్ మీట్

తంగళ్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ రాష్ట్రస్థాయి ఇంటర్ కాలేజీ కల్చరల్ మీట్‌లో బుధవారం విద్యార్థుల ప్రదర్శన పలువురుని ఆకట్టుకుంది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో ప్రారంభమైన రెండవ రోజు కల్చరల్ మీట్ లో విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రోజులపాటు సాగే కల్చరల్ మీట్ లో తెలంగాణలోని 11 వ్యవసాయ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు, 200 అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం వివిధ కళాశాల చెందిన విద్యార్థులు జానపద నృత్యం, ముకాభినయం, నాటిక లను ప్రదర్శించారు. అలాగే పలు అంశాలపై డిబేట్, క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. నేడు కల్చర్ మీటు ముగింపు కార్యక్రమం ఉంటుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కోరుట్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోన వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం బుధవారం వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపి ప్రత్యేక వేదికపై అలివేలు మంగ, లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించి కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.


స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కులగణనలో బీసీలందరూ పాల్గొనాలి

- అగ్రకులాల కుట్రను తిప్పికొట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కులగణనలో ఎలాంటి అపోహలకు, సందేహాలకు తావు లేకుండా బీసీ కులాల ప్రజలంతా పాల్గొనాలని, బీసీ కులాల లెక్కలు తేలడానికి సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆ ధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కులగణన చైత న్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రై మాట్లాడారు. బీసీ కులాల లెక్కలు జరగకుండా అనేక మంది కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ కుట్రలను ఛేదించి బీసీలంతా అప్రమత్తంగా ఉండి వారి కులాన్ని తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచిం చారు. సమగ్ర కులగణన సేకరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగు లపై కులగణన వ్యతిరేకులు అక్కడక్కడ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

అటువంటి వారిని ప్రభు త్వం గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కులగణనపై కొందరు కావాలనే లేనిపోని అపోహవా లు సృష్టించి ప్రజల్ని తీవ్రగందరగోళంలోకి నెట్టివేస్తున్నార న్నారు. కులగణనలో పేర్కొన్న ఆర్థికపరమైన అంశాలు చెబితే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దక్కవని, అబద్దపు ప్రచారాన్ని చేస్తున్నారని తెలిపారు. సమగ్ర కులగణన ద్వారా బీసీ కులాల లెక్కలు తేలితే భవిష్యత్తులో తమ పీఠాలకే ఎసరు వస్తుందనే ఉద్దేశంతో కొంత మంది రాజకీయ ముసుగులో అగ్రకుల నేతలు కులగణనపై ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కుల గణలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన 56 ప్రశ్నలకు తమకు ఇష్ట మున్న సమాచారాన్ని అందించి, కులాన్ని మాత్రం తప్పని సరిగా చెప్పాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చైతన్య సదస్సుల ద్వారా బీసీ కులాలను చైతన్యం చేస్తున్నామని ఆయన తెలిపారు. కులగణనపై సందేహాల ను తీర్చడానికి సచివాలయంలో టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజులకు ఒకసారి ఉన్నత స్థాయి సమీక్ష సమా వేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జీవీఎస్ ఆనంద్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల మధు, జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య, రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, అంజయ్య గౌడ్, మాదాసు సంజీవ్, సురేం దర్, వట్టి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠ శాలకు చెందిన శివకుమార్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కొడిమ్యాలలో జరగిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచాడు. దీంతో ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పాఠ శాలల వాలీబాల్ పోటీలలో శివకుమార్ ఉమ్మ డి కరీంనగర్ జట్టుకు ప్రాతినిథ్యం వహించ నున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు అనుపమ, పీడీ విశ్వప్రసాద్ తెలిపారు. శివకుమార్‌ను పాఠశాల చైర్‌పర్సన్ అర్షనపల్లి రజిత, హెచ్ ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినం దించారు.

కొనసాగుతున్న గురుకుల క్రీడా పోటీలు


మానకొండూర్ గురుకుల పాఠశాలలో జమ్మికుంట-రుక్మాపూర్ కబడ్డీ మ్యాచ్

మానకొండూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధరకాల అంశాల్లో పోటీలు నిర్వహిం చారు. రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన 1190 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. గురువారం క్రీడల ముగింపు కార్యక్రమం, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యో తి):ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసు కను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.ఇల్లంతకుంట సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచా రం మేరకు దాడులు చేసినట్లు పేర్కొన్నా రు. రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని వంతడుపులకు చెందిన నర్సయ్య, బా బు, కంది కట్కూర్‌కు చెందిన అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పల్లె ప్రకృతి వనం చెట్లు నరికిన వారిపై కేసు

వీణవంక నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్కల్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం చెట్లను నరికిన వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. పల్లె ప్రకృతి వనంలో కోర్కల్‌కు చెందిన పూదరి కృష్ణ, ఊదరి అనిల్‌గౌడ్ మరి కొంతమందితో కలిసి 32 చెట్లను నరికివేశారన్నారు. కోర్కల్ పంచాయతీ కార్యదర్శి బొడ్డు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బేగంపేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌పై చీటింగ్ కేసు నమోదు

రామగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మండే హేమపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కొన్ని రోజులుగా ఖాతాదారులకు సంబంధిం చిన డబ్బులను వారి ఖాతాల్లో జమచేయకుండా సొంత అవసరాలకు వాడు కోవడం, అదేవిధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల అకౌంట్ ఖాతాదారుల వద్ద డబ్బులు తీసుకుని వారికి దొంగ పాస్‌బుక్కులు జారీ చేశారు. ఈ విషయమై విచారణ చేపట్టిన పోస్టల్ అధికారులకు 54మంది బాధితుల వద్ద 34లక్షల87వేల 22 రూపాయలు దుర్వినియోగం చేసినట్లుగా గుర్తించారు. దీనిపై గోదావరిఖని పోస్ట్ ఆఫీసు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం మంథని సీఐ రాజు, ఎస్ఐ చంద్రకుమార్‌లు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని పలువురు బాధితులను అడిగి తెలుసుకున్నారు. మిగతా ఎవరైనా బాధితులు ఉన్నట్లైయితే స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా సీఐ సూచించారు.

ఒకరి అరెస్టు

కోనరావుపేట నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని పట్టా చేయిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పెద్దపల్లి స్వామి అనే రైతు పొలం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎండీ పాషా అనే వ్యక్తి పట్టా చేయిస్తానని నమ్మబలికాడు. మోసపూరితంగా రూ.40 వేలను తీసుకున్నాడు. పట్టా చేయమంటే చేయకుండా తప్పించుకుంటున్నాడు. బాధితుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు చోట్ల వాహనాలను పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. ఇందిరాచౌక్‌తోపాటు పలు కూడళ్లలో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి వివరాలు సేకరించి ప్రశ్నించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలతోపాటు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తనిఖీ చేశారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్


నింధితులను చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్ గ్రామ శివారులో గంజాయి సేవిస్తూ పట్టుబడిన నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్సై కిరణ్‌కుమార్‌తో కలిసి వివరాలను తెలిపారు. మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్ గ్రామానికి చెందిన కండెల రవితేజ, రత్నాపూర్‌కు చెందిన సుద్దపల్లి సాయికుమార్ ఇద్దరు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఎస్సైతో కలిసి దాడులు చేశామన్నారు. వారి వద్ద ఉన్న సుమారు 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారు కొంత కాలం నుంచి గంజాయి తీసుకొచ్చి వాటిని చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని యువతకు విక్రయిస్తున్నట్లు తెలిపారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌యూలో ఏఐపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి విష్ణువర్ధన్

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా కృత్రిమ మేధా (ఏఐ), దాని అనువర్తనాలు అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తుందన్నారు. ముఖ్యంగా వైద్యరంగంలో చాలా మార్పులను తీసుకువస్తుందని తెలిపారు. అనంతరం హైదరాబాద్ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బి విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచాన్ని శాసించబోయే టెక్నాలజీగా కృత్రిమ మేధను అభివర్ణించారు. సైన్స్‌కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధపై అవగాహన ప్రతీ ఒక్కరికి అవసరం అని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం అర్జున్ గౌడ్, జి నరసింహచారి, విజయేశ్వరి, ఇతర విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలం ప్రత్యేక బస్సులకు విశేష ఆదరణ

- ఇకపై ప్రతీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు
- ఆర్టీసీ ఆర్ఎం ఎన్ సుచరిత

భగత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంలో పౌర్ణమిగిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకోసం కరీంనగర్ రీజియన్ పరిధిలో నడిపించిన ఐదు ప్రత్యేక బస్సులకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభించినట్లు ఆర్ఎం సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, హుస్నాబాద్, వేములవాడ, గోదావరిఖని, జగిత్యాల నుంచి కార్తీకపౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం ఐదు బస్సులను వేయగా అన్ని బస్సుల్లో సీట్లు పూర్తికావడమే కాకుండా, ఇంకా చాలా మంది అరుణాచల క్షేత్రానికి వెళ్లేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇకపై ప్రతీ పౌర్ణమి రోజున ప్రత్యేక బస్సులను నడిపిస్తామని ఆర్ఎం తెలిపారు.

'పీఎం సూర్యఘర్'తో సౌర వెలుగులు

- తగ్గనున్న విద్యుత్ చార్జీల భారం
- సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ. 78 వేల వరకు సబ్సిడీ


ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

చలికాలమైనా, ఎండ కాలమైనా ఫ్యాన్లు, ఏసీలు వేసుకోక తప్పని వాతావరణం... దిగువ మధ్య తరగతి కుటుంబమైనా.. అల్పాదాయ కుటుంబమైనా కూలర్, రిఫ్రిజిరేటర్, టీవీ సాధారణమైన రోజులు ఇవి.... దీంతో విద్యుత్ వినియోగం ఎక్కువైపోయి చార్జీల భారం తడిసిమోపెడవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నెలకు200 యూనిట్ల వినియోగం వరకు జీరో బిల్ ఇస్తూ ఆ చార్జీల భారాన్ని మోస్తున్నా దిగువ మధ్యతరగతి కుటుంబానికి నెలకు 250నుంచి 300 యూనిట్లకు వరకు విద్యుత్ వినియోగం తప్పనిసరి అవుతోంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి 'సూర్య ఘర్.. ముఫ్త్ బిజిలీ యోజన' ప్రజలకు వరంగా మారింది.

● కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలు

సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రెండు కిలో వాట్ల సామర్థ్యంగల సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకునేందుకు కిలో వాట్‌కు 30 వేల రూపాయలు సబ్సిడీగా ఇస్తోంది. రెండు కిలో వాట్స్ ప్యానళ్ల ఏర్పాటుకు 60 వేలు, అదనంగా మరో కిలో వాట్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే 18 వేల సబ్సిడీని ఇస్తుంది. మూడు కిలో వాట్స్ సామర్థ్యం వరకు గృహావసరాల కోసం ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే 78వేల సబ్సిడీని పొందే అవకాశం ఉన్నది. ఆపై కెపాసిటీ ఉన్న ప్యానళ్లను అమర్చుకుంటే 78వేల రూపాయల సీలింగ్‌తో సబ్సిడీ అందజేస్తున్నది. 150 యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్నవారు రెండు కిలో వాట్స్ వరకు 150 నుంచి 300 విద్యుత్ వినియోగం ఉన్నవారు రెండు నుంచి మూడు కిలో వాట్స్ వరకు, 300 యూనిట్లపై వినియోగం ఉన్నవారు మూడు కిలో వాట్స్ సామర్థ్యం ఉన్న ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. మూడు కిలోవాట్స్ సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవడానికి 2.10 లక్షల నుంచి 2.35 లక్షల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇందులో 78వేల రూపాయలు కేంద్రం సబ్సిడీ పోను వినియోగదారుడు 1.52 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది.

● మిగులు విద్యుత్‌ను అమ్ముకునే అవకాశం

మూడు కిలో వాట్ల సోలార్ ప్యానళ్ల నుంచి నెలకు వాతావరణ పరిస్థితుల మేరకు 320 నుంచి 340 యూనిట్ల సోలార్ పవర్ ఉత్పత్తి అవుతుంది. వినియోగదారుడు అందులో250 యూనిట్లను వినియోగించుకుంటే మిగిలిన 90యూనిట్ల విద్యుత్‌ను డిస్కమ్ కొనుగోలు చేస్తుంది. 250యూనిట్ల విద్యుత్ వినియోగించుకుంటే యూనిట్ చార్జీలు, ఇతర చార్జీలు కలుపుకొని 2,500 రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఈ బిల్లు తప్పడంతోపాటు మిగిలిన 90 యూనిట్ల విద్యుత్‌కు డిస్కమ్ యూనిట్‌కు ఐదు రూపాయల చొప్పున 450 రూపాయలు చెల్లిస్తుంది. వినియోగదారుడు సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు 1.52 లక్షలు వెచ్చిస్తే నెలకు మూడు వేల రూపాయల విలువ చేసే విద్యుత్‌ను పొందే అవకాశమున్నది.

● బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం

సోలార్ విద్యుత్ కోసం వినియోగదారులు తమ ఇళ్ల లో ఎలక్ట్రిసిటీ ఫిట్టింగ్‌ల్లో ఎలాంటి మార్పులు చేసుకో వలసిన అవసరం లేదు. ఇంటికి ఉన్న మీటర్‌ను మార్చి దాని స్థానంలో ఇన్‌పుట్, అవుట్‌పుట్ సదుపాయముండే ప్రత్యేక మీటరును అమర్చుతారు. ఈ మీటరుతో సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తిఅయ్యే విద్యుత్‌ను వినియోగించుకోగా మిగిలింది ఎప్పటికప్పుడు డిస్కమ్‌లకు చెందిన గ్రిడ్‌కు వెళ్లిపోతుంది. రాత్రి పూట వినియోగదారులు డి స్కమ్‌ల నుంచి సరఫరాఅయ్యే విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. డిస్కమ్‌లు ఇంటిలో ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్ ఎంత, వినియోగించుకున్నది ఎంత... లెక్కించి మిగిలిన విద్యుత్‌కు యూనిట్‌కు ఐదురూపాయల చొప్పున యజమానికి చెల్లిస్తారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకో వడానికి బ్యాంకులు రుణసౌకర్యాన్ని ఏడు శాతం వడ్డీపై అందిస్తున్నాయి. హౌసింగ్ సొసైటీ గ్రూపులకు, అపార్టుమెంట్లకు, రెసి డెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు కేంద్ర ప్రభుత్వం కిలోవాట్‌కు 18 వేల రూపాయల చొప్పున మూడు కిలోవాట్స్ సోలార్ ప్యానళ్ల వరకు 54వేల సబ్సిడీని అందజేస్తుంది. ఈ సంస్థలు రిజిస్టర్అయి ఉండాల్సి ఉంటుంది.

● పెరుగుతున్న ఆదరణ

ఉమ్మడి జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లా సెస్ పరిధిలో ఉన్నది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీ ఎల్) పరిధిలో ఉండడంతో ఈ జిల్లాల్లో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధనవనరుల అభివృద్ధి సంస్థ (టీజీఆర్ ఈడీసీవో) లిమిటెడ్ ద్వారా పీఎం సూర్యఘర్.. ముఫ్త్ బిజిలీ యోజనను అమలుచేస్తున్నారు. ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లాలో 529 మంది, జగిత్యాలలో 205మంది, పెద్దపల్లిలో 208 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి ఇళ్లలో సోలార్ విద్యుత్ ప్యానళ్లను అమర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● ప్రభుత్వ కార్యాలయాల్లో సౌరవిద్యుత్

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏర్పాటును తప్పనిసరి చేస్తూ కలెక్టర్లకు లేఖలు రాశారు. ఈ అంశంపై టీజీ రెడ్‌కో అధికారులు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మార్కెట్ గోడౌన్లు, కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్లలో సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయని రెడ్‌కో జిల్లా మేనేజర్ సందీప్‌కుమార్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె లక్ష్మీకాంతరావు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించే విద్యుత్‌కు ఎన్‌పీడీసీఎల్‌కు యూనిట్‌కు తొమ్మిది రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ పథకం కింద సోలార్ విద్యుత్ యూనిట్‌కు 3.74 రూపాయల మాత్రమే చార్జీలుగా తీసుకోనున్నారు. ఈ విద్యుత్ వినియోగంతో ఒక్కో యూనిట్‌పై ప్రభుత్వానికి ఐదు రూపాయలపైగానే ఆదా అయ్యే అవకాశముండడంతో అన్ని కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయని చెప్పారు. గృహ వినియోగానికి సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు విషయంలో ప్రజలకు అవగాహన పెరిగిందని, ఇప్పుడిప్పుడే ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా సబ్సిడీ పొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు.

కొత్త బియ్యంతో అన్నం ముద్దలవుతోంది

- రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి


గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌సీవో అంజలి

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త బియ్యంతో సరిగా వండకపోవడంతో అన్నం ముద్దలుగా మారి విద్యార్థులు ఇబ్బంది పడ్డారని రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి తెలిపారు. మండలంలో రామకృష్ణకాలనీలోని గన్నేరువరం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలను రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి బుధవారం సందర్శించారు. పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థులకు ముద్దలుగా మారిన అన్నం పెడుతున్నారని పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ మేరకు ఆర్‌సీవో అంజలి పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బందితో కలిసి డైనింగ్‌హాల్‌కు వెళ్లి వంట చేసే వారితో మట్లాడానన్నారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త బియ్యాన్ని ఎలా వండాలనే విషయంపై వంటలు చేసేవారిని సూచనలు చేశామన్నారు. ఇక ముందు అన్నం మెత్తగా కాకుండా చూసుకుంటామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అభినందించారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. రామగుండంలో అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కరాటే అసోసియేషన్ ప్రతినిధులు తగరపు శంకర్, సురేష్, శ్రీనివాస్, శంకర్, రాజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

ఆలయాలకు కార్తీక శోభ


గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురిలో కార్తీక భక్తుల సందడి

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం కార్తీక భక్తుల సందడి నెలకొంది. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పన్నెండవ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయంలో ..

వేములవాడ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కార్తీకదీపోత్సవం కొనసాగుతోంది. బుధవారం రాజన్న ఆలయ అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక కార్తీకదీపాలను వెలిగించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాధరణ భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ముందుగా తలనీ లాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించారు.


వేములవాడలో కార్తీక దీపోత్సవం

రాజన్న సేవలో తొగుట పీఠాధిపతి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి స్వా మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దాల మండపంలో అర్చకులకు, అధికా రులకు ప్రసాదం అంద జేశారు.

యూనివర్సిటీ మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి కృషి

- శాతవాహన వీసీ ఉమేష్ కుమార్
- ఎస్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం


జెండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఉమేష్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ నిర్వహణ కోసం సింథటిక్ ట్రాక్ నిర్మించేందుకు కృషి చేస్తానని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అంతర్ డిగ్రీ కళాశాలల మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో రాణిస్తుండడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే శాతవాహన క్రీడాకారులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. యూనివర్సిటీ మైదానంలో వరుసగా రెండు సంవత్సరాలపాటు పీ సెట్‌ను విజయవంతంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో క్రీడల్లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్, ఎస్‌యూ ఫిజికల్ డైరెక్టర్ విజయకుమార్, వివిధ డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు నాగేశ్వర్‌రావు, శ్రీధర్ రావు, పి శ్రీనాథ్ రెడ్డి, దినేష్ పర్వీన్, కడారి రవి, వరుణ్ కృష్ణ, దేవిక, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

- శరవేగంగా ట్రాక్ మరమ్మతులు
- ఇతర మార్గాల ద్వారా పలు రైళ్ల మళ్లింపు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీ, దక్షిణ మధ్య రైల్వే జీఎం, కలెక్టర్


పట్టాలను సరిచేస్తున్న కార్మికులు, యంత్రాలు

పెద్దపల్లి రూరల్/పాలకుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ రైల్వే స్టేషన్, కన్నాల మధ్య మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఢిల్లీ, చెన్నై, సికింద్రాబాద్‌లకు వెళ్లే సుమారు 31 రైళ్లను రద్దు చేయడంతో పాటు పలు రైళ్లను దారి మళ్లించారు. ఘటనా స్థలాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, సౌత్ సెం ట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సందర్శించి ప్రమాద వివరాలు అడిగితెలుసుకున్నారు. త్వరగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల మార్గంలోని ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సంఘటనా స్థలాన్ని సందర్శించి సింగరేణి సంస్థతో మాట్లాడి ఘటనా స్థలానికి భారీ క్రేన్‌లను వచ్చే విధంగా చర్యలు చేపట్టి పనులను ప్రారం భించారు. ఆయన వెంట పాలకుర్తి తహ సీల్దార్ జ్యోతి, పలువురు అధికారులు ఉన్నారు.


పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

● 31 రైళ్లను రద్దు చేసిన అధికారులు

పెద్దపల్లి జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన దృష్ట్యా అధికారులు 31 రైళ్లను రద్దు చేయడంతో పాటు పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. నర్సాపూర్- సికింద్రబాద్, సికింద్రబాద్- నాగ్‌పూర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్ - కరీంనగర్, కరీంనగర్ - బోధన్, సిర్పూర్ టౌన్- భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-బల్లార్ష, బల్లార్ష-కాజీపేట, యశ్వంత్‌పూర్- ముజఫర్‌పూర్ రైళ్లను రద్దు చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- విజయోత్సవాలకు నిధులుంటాయి కానీ బకాయిలకు లేవా?
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విజయోత్సవం నిర్వహించడానికి నిధులు ఉంటాయి కాని.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడానికి లేవా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్థికలోటు ఉందంటూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విజయోత్సవాలను నిర్వహించకుండా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గురుకులాలల్లో తరుచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని, విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడంలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి 11నెలలు అవుతున్నా ట్రిబుల్ ఐటీ ఊసెత్తడం లేదని మండిపడ్డారు. యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులభర్తీ చేయడం లేదన్నారు. విద్యారంగంపై ఇప్పటివరకు సమీక్ష లేదని, విద్యరంగ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళదామంటే అపాయింట్‌మెంట్ దొరకడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామరాపు వెంకటేష్, మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, శ్రావణ్, సాయి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి బలవన్మరణం

సిరిసిల్ల క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలని గణేశ్‌నగర్‌కు చెందిన ఎర్రం కొమురయ్య(55) అనే నేత కార్మికుడు బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరే సుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వస్త్రపరిశ్రమలో సంక్షభం కారణంగా ఎనిమిది నెలలుగా కొమురయ్యకు ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. నేత పని లేక పోవడంతో టేలరింగ్ చేస్తున్నాడు. అయితే ఇళ్లు నిర్మాణం, కూతురు పెళ్లి కోసం దాదాపు రూ. 11 లక్షల అప్పులు చేశాడు. ఆవేదనకు గురైన కొమురయ్య ఇంట్లో ఉరేసుకున్నాడు. కొమురయ్యకు భార్య కమల, కొడుకులు శ్రీకాంత్, సాయికిరణ్, కూతురు వరలక్ష్మి ఉన్నారు. అప్పుల బాధతో మన స్తాపానికి గురై తన తండ్రి ఆత్మహత్య చేసుకు న్నాడని కుమా రుడు శ్రీకాంత్ ఫిర్యాదు చేసినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

కలప పట్టివేత

చందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో అక్రమంగా నిలువ చేసిన టేకు కలపను పట్టుకున్నట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేంద్రరావు బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో ఓ ఇంటిలో టేకు దుంగలను నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేశారు. 7 టేకు దుంగలు లభ్యం అయ్యాయి. కలప విలువ రూ. 25 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం ఎన్గల్ గ్రామ మాజీ ఎంపీటీసీ మాదాసు కవిత ప్రసాద్ తల్లి దేవవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం పరామర్శించారు. పార్టీ కార్యకర్త రామస్వామికి బైపాస్ సర్జరీ కాగా ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

(5వ పేజీ తరువాయి)

రైతుబజార్‌లో మాత్రం ఉదయం వేళ 11 గంటల వరకు కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతు బజార్‌కు కొద్దిమంది రైతులే వస్తుండడంతో మళ్లీ పాత మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనే పరిస్థితి వినియోగదారులకు వస్తుంది. రైతుబజార్‌లో షెడ్లు ఉన్నప్పటికీ అనువుగా లేవని, రైతుబజార్‌లోని రోడ్ల పైనే రైతులు కూర్చొని అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో షెడ్లన్నీ వెలవెలబోవడం నిర్వహణ లేక పెచ్చు లుడుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి.

రూ.5.15 కోట్లతో రైతు బజార్ నిర్మాణం

రైతులు పండించిన కూరగాయలు నేరుగా అమ్ము కోవడం ద్వారా దళారుల ప్రమేయం తగ్గి కష్టానికి ఫలితం పొందుతారని భావించి సిరిసిల్లలో 2.14 ఎకరాల స్థలంలో రూ.5.15 కోట్లతో ఆధునిక హంగులు, సౌకర్యాలతో ప్రత్యేక ఆకర్షణగా రైతు బజార్ నిర్మించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే మోడల్‌గా సిరిసిల్లలో నిర్మించిన రైతుబజార్‌ను పరిశీలించడానికి వివిధ ప్రాంతాల వారు సైతం వచ్చి చూసివెళ్లడం గమనార్హం. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థకు చెందిన 2.14 ఎకరాల స్థలాన్ని మాజీ మంత్రి కేటీఆర్ సెస్ పాలకవర్గాన్ని ఒప్పించి వారికి మరోచోట స్థలాన్ని కేటాయించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైతు బజార్‌ను సిద్ధం చేశారు. కానీ అనుకున్న లక్ష్యం నెరవేరక ఆర్భాటమే మిగిలించింది.

38 కూరగాయలు... 34 మాంసం దుకాణాలు

మోడల్ రైతుబజార్‌లో రైతులు కూర్చోవడానికి వీలుగా నిర్మాణాలు, విక్రయాలకు అనువుగా దుకాణాలను నిర్మించారు. 38 కూరగాయల దుకాణాలు, 34 మాంసం విక్రయ దుకాణాలకు కేటాయించారు. పండ్లు, పూలకు ప్రత్యేక దుకాణాలు నిర్మించారు. రైతులకు, వినియోగదారులు ఉపయోగించే విధంగా మరుగుదొడ్లు. మినరల్ వాటర్ సౌకర్యం కల్పించారు. మున్సిపల్ నిర్లక్ష్యానికి మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడడమే కాకుండా ఇప్పటి వరకు మాంసం దుకాణాలు ప్రారంభం కాలేదు. అద్దీ వ్యాపారులు మాత్రం దుకాణాలు తీసుకొని తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. రైతులు మాత్రం రోడ్లపైన ఇబ్బందులు పడుతూ తాము తెచ్చిన కూరగాయలను అమ్ముకొని వెళ్తున్నారు.



వెక్కిరిస్తున్న పిచ్చిమొక్కలు

సిరిసిల్ల రైతుబజార్‌లో రైతు ప్రతిమలతోపాటు కూరగాయాలు, చేపలు, పండ్లు వంటి ప్రతిమలు వినియోగదారులు ఆకర్షిస్తున్నా సిరిసిల్ల బల్దియా పట్టించుకోకపోవడంతో మార్కెట్‌లో పిచ్చి మొక్కలతో ప్రతిమలు కనబడకుండా వెక్కిరిస్తున్నాయి. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలిచిన మోడల్ మార్కెట్ నిర్వహణ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ప్రభుత్వ కార్యక్రమాలను శ్రద్ధతో అమలు చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

సిరిసిల్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి ధాన్య పత్తి కొనుగోలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ గ్రూప్ 1 పరీక్షలు మాదిరిగానే నవంబరు 17, 18న గ్రూప్ 3 పరీక్షలు పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 12.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా 7.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించామని, మరో 5.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉందని అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో సీసీఐ. ద్వారా 76 వేల మెట్రిక్ టన్నులో పత్తి కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుత సీజన్‌లో దాదాపు 25 లక్షల మెట్రిక్ టన్నుల పంట వస్తుందని అంచనా ఉందన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ రాష్ట్రంలో ఇప్పటి వరకు 21 శాతం పూర్తి చేశామన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1401 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. సీపీవో శ్రీనివాస చారి, డీఆర్‌డీవో శేషాద్రి, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి వసంత లక్ష్మీ, మేనేజర్ రజిత, డీసీవో రామకృష్ణ పాల్గొన్నారు.

‘భవన నిర్మాణ రంగ వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం’

కోనరావుపేట, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణం రంగ వెల్ఫేర్ బోర్డు నిధులను హెల్త్ సెంటర్ పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దుర్వినియోగం చేస్తున్నాయని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి ఆరోపించారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో బుధవారం భవన నిర్మాణ రంగ వెల్ఫేర్ బోర్డు నిధులను హెల్త్ సెంటర్ పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని హెల్త్ సెంటర్‌ను అడ్డుకొని మాట్లాడారు. హెల్త్ సెంటర్ పేరుతో వచ్చి కార్మికులు లేకున్నా హెల్త్ చెకప్‌లు చేసినట్లు చూపిస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. కార్మికుల వద్ద రక్త నమూనాలను చెకప్‌లు ఎలాంటి వైద్య పరీక్షలు చేయకుండా నిధులను వాడుకుంటున్నారని ఆరోపించారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

వేములవాడ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలిపాక రోషిణి(28) అనే వివాహిత మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి గ్రామానికి చెందిన కొలిపాక సుమన్ హైదరాబాద్‌లోని ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తూ అక్కడే కుటుంబసభ్యులతో జీవిస్తున్నారు. రెండు రోజుల క్రితం శుభకార్యంలో పాల్గొనడానికి లింగంపల్లి గ్రామానికి కొలిపాక సుమన్ తన భార్య రోషణితో వచ్చారు. తిరిగి హైదరాబాద్ వెళ్లే క్రమంలో ఔటర్ రింగ్‌రోడ్డులో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు లారీని ఢీకొనడంతో భార్య రోషిణి చాతికి తీవ్రగాయాలయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కారులో ప్రయాణిస్తున్న సుమన్‌కు, కూతురు వైష్ణవికి స్వల్పగాయాల య్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్

బోయినపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ సూచించారు. మండలలోని దుండ్రాపల్లి, అనంతపల్లి, కోరేం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ తోపాటు మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండీ బాబు, రోమల అజయ్, కాంగ్రెస్ నాయకులు జంగ సత్యం,ద్యావ మహిపాల్ రెడ్డి, ప్రేమ్, సంపత్ కుమార్, జంగం పర్శరాములు, మార్కెట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కోటేశ్వర స్వామికి ఏకాదశి పూజలు

వెల్గటూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిలింగాల శ్రీకోటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటిలింగాల గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భ క్తులు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. స్వా మి వారికి అర్చనలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు కోరిన కోరికలు తీరాలని మొక్కుకొని గోదావరిలో వది లారు. శ్రీ కోటేశ్వర స్వామి వద్ద కార్తీక దీపాలు వెలిగించి మహిళ భక్తులు మొ క్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ భక్తులచే పూజలు చేయించారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనను అడ్డుకుంటామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రంలో రైల్వే భూనిర్వాసితులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే లైన్ పేరుతో భూములకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఎలాంటి క్రయ విక్రయాలు జరపకుండా భూముల యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వేములవాడ రాజన్న క్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవ స్థానంగా తీర్చిదిద్దుతామని చెబితే తాము స్వచ్ఛందంగా అభివృద్ధి కోసం భూములు ఇస్తామని చెప్పామని తెలిపారు. పరిహారం కూడా మూడింతలు ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటికే భూమిని సేకరించగా, దాదాపు మరో 120 మంది రైతుల నుంచి రైల్వే కోసం భూసేకరణ జరగాల్సి ఉందని తెలిపారు. పరిహారం విషయం తేల్చకపోగా, కనీసం సమాచారం లేకుండా కాలయాపన చేస్తుండడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎన్నికలకు ముందు వేములవాడకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రైల్వే భూ నిర్వాసితులకు, మధ్య మానేరు నిర్వాసితులకు కూడా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. భూ నిర్వాసితుల పక్షాన తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వద్ద కూడా పలుమార్లు వెళ్లామని న్యాయం చేస్తామంటున్నారు తప్ప ఏడాది కావస్తున్న ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదీన వేములవాడకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని తమకు సమాచారం ఉందని రైల్వే భూనిర్వాసితుల సమస్యను ఈ లోపల పరిష్కరిం చాలని అన్నారు. సీఎం వేములవాడకు వస్తున్న విషయాన్ని భూ నిర్వాసితుల తన దృష్టికి తెచ్చారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలనే రైల్వే భూ నిర్వా సితులకు న్యాయం జరగకుంటే ముందుండి అడ్డుకుంటా నన్నారు. రైల్వే లైన్ భూ నిర్వాసితులు శంకర్, నర్సయ్య, శేఖర్, ఎల్లయ్య, పద్మ పాల్గొన్నారు.




కొండ దేవయ్యతో రైల్వే భూ నిర్వాసితులు

ప్రధాన వైద్యశాల ఎదుట పారిశుధ్య కార్మికుల ధర్నా

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో పడకలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని తమకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం విధులను బహిష్కరించి జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఎదుట ఆసుపత్రిలోని పారిశుధ్య కార్మికుల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పడకలకు అనుగుణంగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు లేరన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వారిలో 37 మంది కార్మికులను మెడికల్ కళాశాలకు పంపించారన్నారు. కళాశాలకు పంపించిన కార్మికులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తిరిగి కేటాయించాలని లేదా ప్రభుత్వం వెంటనే పడకలకు అను గుణంగా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. దీంతో ఆసుపత్రి అధికారులు, కాంట్రాక్ట్ ఇన్‌చార్జి స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై యూనియన్ నాయకులతో చర్చలు జరిపి 15 రోజులలో పడకల అనుగుణంగా సిబ్బందిని నియమించి కార్మికుల పనిభారం తగ్గిస్తామన్నారు.

వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలని వినతి

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చేసిన పాపాలను ప్రక్షాలణ చేయాలని, ప్రస్తుత సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశామని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో మాట్లాడుతూ చేనేత జౌళిశాఖ కార్యదర్శి శైలజారామయ్యర్‌ను కలిసినట్లు చెప్పారు. నాగేశ్వర్‌రావు స్పందించి సమస్యలను పరిష్కరిస్తామన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బండారి అశోక్, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం మాజీ అధ్యక్షుడు మండల సత్యం, మాజీ కార్యదర్శి వెల్దండి దేవదాస్, పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటరెడ్డి

పద్మశాలీల ఆత్మగౌరవం తాకట్టు పెట్టుకున్న బీఆర్‌ఎస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పద్మశాలీల ఆత్మగౌరవాన్ని పదేళ్ల బీఆర్‌ఎస్ నాయకులు తాకట్టు పెట్టుకున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలు, పద్మశాలీల బతకమ్మ చీరల బకాయిల విషయాన్ని ముఖ్యమంత్రి, జౌళి శాఖ మంత్రి దృష్టికి కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి తీసుకెళ్లారన్నారు. రూ.300 కోట్లు బకాయిలు ఇప్పించడానికి ఎంతో కృషి చేశారన్నారు. కేకే మహేందర్‌రెడ్డి పద్మశాలీలను అగౌరవపరుస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కేకే మహేందర్‌రెడ్డి ఇప్పించిన బకాయిలు ఎవరికిచ్చారన్న బీఆర్‌ఎస్ నాయకులకు కనిపించలేదా? ప్రశ్నించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులు, ప్రజలను అడిగితే తెలుస్తుందన్నారు. మీరు ఎన్ని కోట్లలో ఆస్తులు సంపాదించారో ఆలోచన చేసి విమర్శలు చేయాలన్నారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన బైరి అమర్ స్రవంతి కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన కేకే మహేందర్‌రెడ్డి జౌళిశాఖ అధికారి సాగర్‌తో మాటాడినట్లు చెప్పారు. అధికారి వివరాలతో దంపతులు వ్యక్తిగత కారణాలతో చనిపోయి ఉంటారని చెప్పారన్నారు. మానవతా దృక్పథంతో వారికి అందాల్సిన సహాయంగా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కేకే మహేందర్‌రెడ్డి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప మాట్లాడుతూ సిరిసిల్లలో 365 రోజులపాటు కార్మికులకు పని ఉండేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరలను తీసుకొచ్చి ఆ వ్యవస్థను నాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం సిరిసిల్లలో మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు కేసీఆర్ నగర్‌లోని డబ్బులు బెడ్‌రూంలను అమ్ముకున్నదానిపై కేటీఆర్ వెంటనే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కత్తెర దేవదాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్,

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీలో కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, విద్యార్థి సంఘాల నాయకులపై దాడులు చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియ హాస్టల్ గదిలో ఉరేసుకుందని, ఆ అమ్మాయి మృతదేహాన్ని చూసేందుకు వెళ్లిన ఏబీవీపీ నాయకులను అక్కడున్న యూనివర్సిటీ అధికారులు ప్రవేటు సిబ్బంది, సెక్యూరిటీ విచక్షణరహింతగా దాడి చేయడం సరికాదన్నారు. గతంలో కూడా ఒక విద్యార్థిని చనిపోతే ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులపై దాడులు చేశారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవడంతోపాటు ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు ఏబీవీపీ నాయకులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి ఎనగందుల శ్రీనివాస్, గల్లి అంజి, సాయిభరత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని టీడీపీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి దయాకర్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలో బుధవారం టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు పార్టీ రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సిరిసిల్ల హడక్ కమిటీ సభ్యులు తీగల శేఖర్‌గౌడ్, మచ్చ అంజనేయులు, ఎల్లారెడ్డిపేట మండలాల మాజీ అధ్యక్షులు చేట్కూరి అంజేయులు, ముస్తాబాద్ మండల మాజీ అధ్యక్షుడు సుద్దాల దేవయ్య, మాజీ ప్రధాన కార్యదర్శి అబ్బనవేని ఆశన్న, నాయకులు బింగి వెంకటేశం, మిద్దె ప్రకాశ్, రంగు శేషాచలం, పంజా బాలరాజు, జెట్టి కొమరయ్య, గుజ్జె అశోక్ పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు అక్కపల్లి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే తీరు ఎంపీడీవో సత్తయ్య బుధవారం పరిశీలించారు. సర్వే వివరాలను సేకరిస్తున్న ఎన్యూమరేటర్లతో మాట్లాడారు. పకడ్బందీగా సర్వేను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం కోరిన వివరాలను ప్రజలు తెలియజేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అనుమతి లేకుండా బండల పేల్చివేత

ఎల్లారెడ్డిపేట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులో అనుమతి లేకుండా బండరాళ్లను పేలుస్తున్న కంప్రెసర్ ట్రాక్టర్‌తోపాటు రెండు జేసీబీ వాహనాలను సీజ్ చేశామని తహసీల్దార్ రామచంద్రం బుధవారం తెలిపారు. గ్రామంలోని షఫీ తన వ్యవసాయ భూమిలో ప్రభుత్వ అనుమతి లేకుండా కంప్రెసర్ ట్రాక్టర్‌తో జిలెటిన్ స్టిక్స్‌ను బిగించి పేలుళ్లకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. అనుమతి లేకుండా పేలుళ్ల పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గోల్కోండ శ్రీధర్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి గోల్కోండ శ్రీధర్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయులకు సమగ్ర కుటుంబ సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఉపాధ్యాయులకు సీఎల్ అనుమతి ఇవ్వాలన్నారు. అవసరమైతే సమగ్ర కుటుంబ సర్వే గడువు పొడిగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రమేష్, కోశాధికారి పరకాల రవీందర్, పసుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం సందర్శన

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంను బుధవారం రిలయన్ ఫౌండేషన్ సభ్యులు సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయాలని ముందడుగు వేసి ప్రణాళికలను రూపొందిస్తుంది. దీనిలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంను రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు క్షుణంగా పరిశీలించారు. వాలీబాల్ అకాడమీ క్రీడాకారులను రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, రిలయన్స్ ఫౌండేషన్ ఆపరేషనల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆపరేషన్ అథ్లెటిక్స్ మేనేజర్ సాగర్‌పటేల్, టాలెంట్ స్కాట్ రాంధర్‌యాదవ్, ఎల్‌బీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, వాలీబాల్ అకాడమి కోచ్‌లు గుర్రం సంపత్, జగన్‌మోహన్, కబడ్డీ కోచ్ ప్రశాంత్, ఆర్చరీ కోచ్ హరీష్, అకాడమీ వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

గంభీరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం ముచ్చర్ల ముదిరాజ్‌లు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మెతుకు కర్రె నర్సవ్వకు చెందాల్సిన వ్యవసాయ భూమిని అప్పట్లో సంబంధిత అధికారులు దొంగ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. దొంగ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, మెతుకు నర్సవ్వ పేరున వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ భూపతికి వినతి పత్రం అందజేశారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గం

గంభీరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ ఐక్య వేదిక ఫెడరేషన్ (టీఎస్‌యుటిఎఫ్) గంభీరావుపేట మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఫసియుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా అంబేడ్కర్, ఉపాధ్యక్షులుగా జే శ్రీశైలం, మహిళ ఉపాధ్యక్షులుగా రాజ్యలక్ష్మి, కోశాదికారిగా జోగు నరేష్‌కుమార్ ఎన్నియ్యారు.

తిరుమల తిరుపతి దేవస్థానం తీర్థప్రసాదాలు

కోనరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం తీర్థ ప్రసాదాలను భక్తులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు గోవింద నామాల స్తోత్రం పారాయణం చేశారు. అర్చకులు మంగళగిరి లక్ష్మయ్య కిష్టయ్య, చక్రపాణి, వేణు ఉన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి

వేములవాడ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిపై దృష్టిసారించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో సెలూన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చిన్న తరహాపరిశ్రమలు నెలకొల్పేందుకు సబ్సిడీ అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

చందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంస్థాగత ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు క్యాతం దశరథరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల మండల స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో పార్టీని అంచెలంచెలుగా సామాన్య ప్రజానీకం వద్దకు తీసుకెళ్లే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు పొంచేట్టి రాకేష్, నాయకులు చిర్రం తిరుపతి, పెరుక గంగారాజు, మొకిలె విజేంతిరికోండ తిరుపతి, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవులు

జగిత్యాల అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈ నెల 15 నుంచి మూడు రోజులపాటు సెలవులు ప్రకటించి నట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సెలవు ఉండగా, మార్కెట్ యార్డులో ధాన్యం నిల్వలు పేరుకుపోయి నందున, ధాన్యం పోయడానికి స్థలం లేనం దున శని, ఆదివారాలు కూడా మార్కెట్ యార్డులో కొనుగోలు జరుగవని తిరిగి సోమవారం యథావిధిగా మార్కెట్ ప్రా రంభం అవుతుందని, గమనించాలని ఆయన కోరారు.